క్లుప్తంగా

4 నుంచి నవరాత్రి ఉత్సవాలు

రొంపిచెర్ల: ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు ముత్యాలమ్మ ఆలయంలో నిర్వహించ తలపెట్టిన నవరాత్రి ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ ఓ.సురేంద్రబాబు కోరారు. సోమవారం ఆలయంలో పాలక వర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఉభయదారులు ఉత్సవాల ప్రారంభానికి ఒక రోజు ముందే ఆలయ అర్చకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 4,5,6,7,8 తేదీలలో సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు, 9,10,11,12,13 తేదీలలో ఉదయం 7నుంచి 9.30 గంటలకు వరకు భక్తుల నామగోత్రాలతో అమ్మవారికి శుద్దోదక, కుంకుమార్చన, మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, పూజలో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో రావాలన్నారు.

ఇరుముడి మొక్కులు చెల్లింపు



సదుం: మండలంలో పలువురి ఆంజనేయ స్వామి దీక్ష ముగియడంతో బత్తలవారిపల్లె కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇరుముడులు కట్టుకుని అనంతపురం జిల్లా కసాపురంలో ఉన్న నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి మొక్కులు చెల్లించేందుకు బయలుదేరారు.

కళాశాలకు దూరంగా మద్యం దుకాణాలు

- ఎస్‌ఐకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల వినతి



వినతి పత్రం ఇస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కల్లూరు(పులిచెర్ల): కళాశాల ఆవరణాలకు దూరంగా మద్యం దుకాణాలను ఉండేలా చూడాలని జాతీయ సేవా పతకం వలంటీర్లు సోమవారం కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. తమ కళాశాల సమీప దుకాణాలలో గుట్కాలు, బీడీలు, సిగరెట్ల అమ్మకాలను అరి కట్టాలని వీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. ఈ అమ్మకాల వల్ల విద్యార్థులకు వాటికి ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందని చెప్పారు.

నీతి పద్యాల పుస్తకాలు పంపిణీ

రామకుప్పం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తుల సీనాథం నీతి పద్యాల పుస్తకాలను పంపిణీ చేసారు. ఆయన మాట్లాడుతూ, నీతి పద్యాలు నేర్చుకోవడం వలన విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. విద్యార్థులు రోజూ ఒక పద్యం నేర్చుకోవడం ప్రారంభిస్తే వంద పద్యాలను సులభంగా నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీలో స్వచ్ఛతా హి సేవ



చెత్తాచెదారం తొలగిస్తున్న విద్యార్థినులు

రొంపిచెర్ల: స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో సోమవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, చెత్తాచెదారాన్ని విద్యార్థినులు తొలగించారు. గ్రేట్ విజన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జీవీఎస్.బాబు మాట్లాడారు. అందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఓ సుజాత, బహుజన విద్యావేత్త డాక్టర్ రఘునాథ్, సంస్థ కో–ఆర్డినేటర్ రాణెమ్మ, వలంటీర్ నాగరాజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీ అమర వీరులకు నివాళి



అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. డీఎఫ్ఓ వేణుగోపాల్, సిబ్బంది అమర వీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ, అడవుల పరిరక్షణలో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. అంకిత భావంతో అడవులను, వన్యప్రాణులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక అటవీశాఖ ఎఫ్ఎస్వోలు, ఎఫ్‌బీవోలు, ఏబీవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం మండలంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్



కూరగాయలను ట్రేలలోకి నింపుతున్న కార్మికులు



ఆహార శుద్ధి.. ఆదాయ వృద్ధి

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో రైతన్నలకు మేలు
- ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, గ్రేడింగ్ సౌకర్యం
- వ్యవసాయోత్పత్తులకు ధర లేనప్పుడు కోల్డ్‌స్టోరేజీలో నిల్వ
- రెండువేల మందికి పైగా రైతులకు లబ్ధి
- కొన్ని యూనిట్లలో ఇప్పటికే మొదలైన సేవలు



పంట ఉత్పత్తులను గ్రేడింగ్ చేసే యంత్రాలు

పలమనేరు: ఆరుగాలం పంట పండించిన రైతుకు ధరల పతనం వలన కలిగే నష్టాలను తగ్గించేందుకు..వారికి మెరుగైన ధర కల్పించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం అప్పట్లో తీసుకున్న చర్యలు ఫలితాలు ఇస్తున్నాయి. రైతు పండించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం, సరుకు నాణ్యంగా ఉండేలా యంత్రాల సాయంతో గ్రేడింగ్, ఆపై ప్యాకింగ్‌తో మంచి ధర కల్పించేలా జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమలను నెలకొల్పింది. ఫలితంగా వ్యవసాయోత్పత్తులను శీతల గిడ్డంగుల్లో భద్రపరచి ధరలున్నప్పుడు విక్రయించుకునే వెసులుబాటు ఇకపై వీటి ద్వారా జిల్లా రైతులకు కలగనుంది. జిల్లాలో నిర్మించిన టమాటా విలువ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్లతో 60మందికి ప్రత్యక్ష్యంగా, 2,500మంది రైతులకు పరోక్షంగా లబ్ధి చేకూరనుంది.

కూరగాయల సాగుకు కేరాఫ్‌గా పలమనేరు

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో అన్ని రకాల కూరగాయలు ఎక్కువగా సాగవుతున్నాయి. ముఖ్యంగా టమాట ఇక్కడ సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాడి పొడువునా సాగు చేయడం పరిపాటి. ఇక్కడి శీతల వాతావరణం, ఎర్రటి నేలలుండడంతో కూరగాయ పంటల సాగుకు అనుకూలంగా ఉంటోంది. ఇక్కడ ప్రధానంగా టమాట 4,500 హెక్టార్లు, బంగాళాదుంప 400 హెక్టార్లు, క్యాబేజి 300, బీన్సు 700, క్యారెట్, బీట్‌రూట్ తదితర పంటలు 50 హెక్టార్లలో సాధారణ సాగుగా ఉంది.

జిల్లాలో రూ.16.5కోట్లతో మూడు టమాట ఆధారిత యూనిట్లు

ఏపీ ఫుడ్ ప్రాసెసెసింగ్ సొసైటీ ద్వారా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఆపరేషన్ గ్రీన్స్ ప్రోగ్రాం ద్వారా ఎంవోఎఫ్‌పీఐ(మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రైమరీ ఇండస్ట్రీస్ రాష్ట్రంలో రూ.1,719 కోట్లతో 11 ఆహారశుద్ధి పరిశ్రమలను గత ప్రభుత్వం నెలకొలి్పంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఆరు యూనిట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో టమాట విలువ ఆధారిత పరిశ్రమలు మూడు మన జిల్లాలోనే కావడం విశేషం! ఒక్కో యూనిట్ విలువ రూ.5.5 కోట్లతో పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని గంగవరం మండలం అటుకురాళ్లపల్లె, బైరెడ్డిపల్లె మండలం చప్పిడిపల్లె, సోమల మండలంలోని కామిరెడ్డివారిపల్లెలో రూ.16.5 కోట్లతో వీటిని నిర్మించారు.

రైతన్నలకు పలు ప్రయోజనాలు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు సంబంధిత ప్రాంతాల్లోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు పండించిన పంటలను నమోదు చేసుకుంటాయి. పలు రాష్ట్రాలకు చెందిన బహుళజాతి సంస్థలు, హోటళ్లు, మాల్స్, కార్పొరేట్ కళాశాలల హాస్టళ్లు, క్యాంటీన్లు, రిలయన్స్ తదితర కంపెనీలకు అవసరమైన నాణ్యమైన కూరగాయల ఇండెంట్‌ను సేకరిస్తారు. వారి అవసరాల మేరకు ఇక్కడి రైతుల ఉత్పత్తులను సేకరిస్తారు. పండించిన పంట ఉత్పత్తులను ఇక్కడి యూనిట్లలో యంత్రాలతో గ్రేడింగ్, ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేసి విక్రయదారులకు చేరవేస్తారు. దీంతో సరుకు నాణ్యతగా ఉంటుంది కాబట్టి మంచి ధర రైతులకు దక్కుతుంది. దీంతోపాటు మార్కెట్‌లోలా రైతులకు కమీషన్ లేకుండానే నగదు చెల్లిస్తారు. ప్రస్తుతం ఇక్కడి యూనిట్‌లో టమాట, బంగాళదుంప, ఉల్లిపాయలు, బీట్‌రూట్ లాంటివి ప్రాసెసింగ్ చేస్తున్నారు.

శీతల గిడ్డంగుల్లో నిల్వతో ఉపయోగం

రైతులు ఎక్కువగా పండించే టమాట, ఉర్లగడ్డలు, చింతపండు ధర లేనపుడు వాటిని ఏసీ గోదాముల్లో నిల్వ ఉంచుకునేలా ఇందులో నిర్మించారు. అవసరమైన రైతులు తమ వ్యవసాయోత్పత్తులను వీటిల్లో నిల్వ ఉంచి ధర ఉన్నప్పుడు విక్రయించుకుని నష్టాల నుంచి బయటపడొచ్చు. ఇందుకు సంబంధించి రైతులనుంచి నామమాత్రం రుసుం వసూలు చేస్తారు.

ఆర్వో ప్లాంట్లను పునరుద్ధరించండి

- మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్



మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా, పక్కన కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: పట్టణంలోని 14 ఆర్వో ప్లాంట్లను పునరుద్ధరించి మంచినీరు సరఫరా చేయాలని మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ సమావేశం చైర్మన్ అలీమ్ బాషా అధ్యక్షతన నిర్వహించారు. కౌన్సిలర్లు అమ్ము, రేష్మ, త్యాగరాజు తాగునీటి సమస్యపై మాట్లాడారు. పట్టణంలోని 14 ఆర్వో ప్లాంట్లను మూసివేయడం బాధాకరమన్నారు. గతంలో ఈ ప్లాంట్ల నిర్వహణకు పీఎల్ఆర్ కంపెనీ నిధులను సమకూర్చేదన్నారు. ప్రస్తుతం తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ఒకొక్కరు రూ.20 పెట్టి 20 లీటర్లక్యాన్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్లను ప్రారంభిస్తే ప్రజలు తాగునీటిని కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. అలాగే పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. మరో వైపు పట్టణంలో వీధి కుక్కల బెడద తీవ్రమవుతోందని, పెద్దలు, పిల్లలు తేడా లేకుండా కుక్కకాటుకు బలవుతున్నారని కౌన్సిలర్ త్యాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర మధుసూన్‌రెడ్డి ప్రతిస్పందించారు. వీధి కుక్కల పట్టి వాటిని తిరుపతికి తీసుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపాలిటీలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చైర్మన్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో ఆర్వో ప్లాంట్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుని తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు ఆస్తిపన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో అజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లలిత, వైస్ చైర్మన్ నాగేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలరించిన 'అర్జున తపస్మాన్'



తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున పాత్రధారి

సదుం: మండలంలోని భట్టువారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పాండవులు, ద్రౌపదీ దేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి, వాటిని తపస్మాన్ వద్దకు తీసుకువచ్చారు. అర్జున పాత్రధారి పద్యాలు ఆలపిస్తూ పాశుపతాస్త్రం కోసం తపస్మాన్ మెట్టు మెట్టునూ అధిరోహించారు. సంతాన లేమితో బాధపడుతున్న మహిళలు ఉపవాస దీక్షలతో తపస్మాన్ వద్ద వరపడ్డారు. తపస్మాన్ పై నుంచి అర్జున పాత్రధారి విసిరిన విభూది ఉండలు, పండ్లు, నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు. వాటిని దక్కించుకుంటే కోరిన కోర్కెలు ఫలిస్తాయని భక్తుల నమ్మకం. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంకణధారులు మల్‌రెడ్డి, నారాయణ దంపతులు, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద, చిన్నరమణ, రవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

- పలు సమస్యలను ప్రస్తావించిన కౌన్సిలర్లు



సన్మానం అందుకున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో చైర్‌పర్సన్, అధికారులు

పలమనేరు: పలమనేరు మున్సిపల్ అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం తెలిపింది. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. రూ.20లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులు, రూ.13లక్షలతో మేజర్ డ్రైన్లు, విద్యుద్దీకరణ పనులు దీంతోపాటు పట్టణంలో రూ.11.20లక్షలతో పలుచోట్ల పీవీసీ పైప్‌లైన్ల ఏర్పాటు పనులు అజెండాలో ఉన్నాయి. ఇక పట్టణంలోని కాకాతోపు, గంటావూరులలో అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి, మున్సిపల్ పరిధిలోని కార్యాలయాలకు అద్దె చెల్లింపులు, వార్డుబాటలో గుర్తించిన పనులకు రూ.14.50లక్షలు సాధారణ నిధులతో చేపట్టేందుకు ఆమోదం లభించింది. స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు పట్టణంలో నీటి సమస్య కోసం గంగమ్మ శిరసు ప్రాజెక్టు, వీవీమహల్ పక్కన 470/2సర్వే నంబరులో 39 సెంట్లలో ఆడిటోరియం నిర్మాణం కోసం డీపీఆర్ తయారు చేసేందుకు కౌన్సిల్ ఆమోదించింది. మొత్తం మీద 17 అంశాలకు కౌన్సిల్ పచ్చజెండా ఊపింది.

సమస్యలపై ప్రశ్నించిన కౌన్సిలర్లు

కౌన్సిలర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, గతంలో రూ.45లక్షలతో ఎంపీ నిధులు మంజూరయ్యాయని, ఆపనులను ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గొబ్బిళ్లకోటూరు రోడ్డు, అనుమతులు లేని మున్సిపల్ గదుల సమస్యను టీడీపీ కౌన్సిలర్ శారద లేవనెత్తారు. పట్టణంలోని హైవేలోని హోటళ్లు ఇష్టానుసారంగా ధరలతో దోచుకుంటున్నాయని, వాటిల్లో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ నయాజ్ కోరారు. ఆడిటోరియానికి గతంలో డీపీఆర్ తయారు చేశారని, ఇప్పుడు మళ్లీ తయారీ పేరిట డబ్బులు వృధా చేయరాదనికౌన్సిలర్ కోదండరామయ్య సూచించారు. 13,14 వార్డుల్లో నీటి సమస్యను తీర్చాలని కౌన్సిలర్ నాగరాజు డిమాండ్ చేశారు. వీటిని పరిష్కరించేంచుకు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. కొత్తగా విధుల్లో చేరిన ఆయా శాఖల అధికారులు పరిచయం చేసుకున్నారు. కాగా, విజయవాడకు వెళ్లి వరద సహాయక చర్యలు సేవలందించిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలని సీఎంకు వినతి

కుప్పం: గుడుపల్లె మండలం కమ్మగుట్టపల్లెకు చెందిన వడ్డెర సంఘ జిల్లా కార్యదర్శి మోహన్ తమ భూ సమస్యను పరిష్కరించాలని ఆదివారం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. కమ్మగుట్టపల్లెలో వంశపారం పర్యంగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమిని ప్రభుత్వ రికార్డుల్లో పశువుల మేత బీడుగా మార్చి వేశారని, దీనిపై పలు పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు మోహన్ పేర్కొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణకు కృషి



అవగాహన కల్పిస్తున్న సుధాకర్

సదుం: జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత అని జన విజ్ఞానవేదిక పరిరక్షణ విభాగ కన్వీనర్ సుధాకర్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో జీవ వైవిధ్యం, దాని ప్రాముఖ్యతపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. మానవాళికి భూమిపై జీవించే హక్కు ఎంత ఉందో అంతే హక్కు ఇతర జీవరాశులకు ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సమతుల్యత పాటించాలన్నారు. దీనికి సంబంధించిన చిత్రాలను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి చెప్పారు. సైంటిస్ట్ కరీముల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం..!

కుప్పం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కుప్పంలో సాయిమాత సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో సేకరించి సామగ్రి, వస్తువులకు విజయవాడ వరద బాధితులకు అందజేశారు. ఇప్పుడు రెండో పర్యాయం దాతల నుంచి బియ్యం , పప్పు, బట్టలు స్వీకరిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

రామకుప్పం: కర్ణాటక రాష్ట్రం క్యాసంబళ్ల పరిధిలోని బలవనహల్లికి చెందిన గంగప్ప(89) భార్య లక్ష్మమ్మ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతితో గంగప్ప మనస్తాపం చెందిన గంగప్ప సోమవారం ఉదయం రామకుప్పం మండలం రాజుపేట వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మల్లేష్ యాదవ్, ఇన్‌చార్జి ఎస్‌ఐ నరేష్ ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- నిందితుడి అరెస్ట్



పలమనేరు: స్కూటీలో తరలిస్తున్న రూ.25వేల విలువైన కర్ణాటక మద్యం సోమవారం పట్టుబడింది. దండపల్లె క్రాస్ వద్ద పలమనేరు పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పెంగరగుంట పంచాయతీ మొసలిమడుగుకు చెందిన తేజ(21) మద్యం తీసుకువస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ స్వర్ణతేజ తెలిపారు.

క్రీడల్లోనూ సత్తా చాటండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పోటీల ప్రారంభంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: విద్యలోనే కాకుండా క్రీడల్లో సైతం విద్యార్థులు సత్తా చాటాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ముదరందొడ్డి ఉన్నత పాఠశాలలో గ్రిగ్ మెమోరియల్ జోనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌కు సంబంధించి జిల్లా స్థాయి ఖో–ఖో పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో విద్యార్థి దశ కీలకమన్నారు. చదువు, క్రీడలకు సమ ప్రాధాన్యత ఇస్తూ భవితకు బాటలు వేసుకోవాలన్నారు. క్రీడలతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగితే ఉద్యోగాలు సైతం పొందవచ్చన్నారు. ఆ దిశగా విద్యార్థులు శ్రమించి, స్కూలుకు, తమ గ్రామాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల కమిటీ నివేదించిన సమస్యపై ఆయన సానుకూలంగా స్పందించారు. జెడ్పీ నిధుల నుంచి నిధులు మంజూరు చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రెడ్డి, సర్పంచ్ దామోదరం, వైస్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, విద్యానికేతన్ కరస్పాండెంట్ దామోదరం, పాఠశాల హెచ్‌ఎం చైతన్య, పీఈటీలు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు పరిసమాప్తం



యాగశాలలో హోమం చేస్తున్న పురోహితులు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం పరిసమాప్తమయ్యాయి. పవిత్రోత్సవాల్లో మూడు రోజులు అంకురార్పణం, పవిత్ర ప్రతిష్ఠ, కుంభారాధనలు, హోమాలు, స్నపన తిరుమంజనం, శ్రీవారి పూజా కైంకర్యాలు, గ్రామోత్సవం, పవిత్రాల సమర్పణ.. ఇత్యాది కైంకర్యాలను టీటీడీ పురోహితులు ఆగమశాస్త్ర ప్రకారంగా నిర్వహించారు. చివరి రోజు కుంభావాహన ప్రధాన హోమాలు, సాయంత్రం పూర్ణాహుతి అనంతరం ఆలయంలో సమర్పించిన పవిత్రాలను విసర్జన చేసి స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. టీటీడీ ఏఈఓ గోపీనాథ్, కంకణంబట్టు ఏకే.నరసింహాచార్యులు, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్ష దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రమణ్యస్వామి వారోత్సవాలు





పల్లకి మోస్తూ ఆర్డీఓ శ్రీనివాసరాజు,సీఐ మల్లేష్ యాదవ్, విశేష అలంకరణలో సుబ్రమణ్యస్వామి

రామకుప్పం: మండలకేంద్ర సమీపంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం సుబ్రమణ్యస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅ మ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులు స్వామివారికి మొక్కుబడులు చెల్లించారు. కావడులు సమర్పించారు. ఆలయ పరిసరాల్లో శ్రీవల్లీ దేవసేన సమేతుడై సుబ్రమణ్యస్వామి మయూర వాహనంపై ఊరేగారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, రూరల్ సీఐ మలేష్ యాదవ్ సుబ్రమణ్యస్వామి ఉత్సవాల్లో పల్లకి మోశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కల్లూరు(పులిచెర్ల): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్త హీనత బారిన పడకుండా ఉండేందుకు ఆహారంలో క్రమం తప్పకుండా తాజా ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలి

పుంగనూరు: అన్నమయ్య జిల్లా రామసముద్రం దిగువ దళితవాడకు చెందిన గోవిందు అనే యువకుడిపై దాడి చేసి గాయపరచిన వారిని అరెస్ట్ చేయాలని మాల మహానాడు నేతలు అశోక్, మనోహర్, మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బాధితుడిని పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో అశోక్ మాట్లాడారు. రామసముద్రంకు చెందిన ఆదినారాయణరెడ్డి, ధనుంజయరెడ్డి, రాము, ఉదయ్‌కుమార్ దళిత యువకుడు టమాటాలు దొంగలించాడని దాడి చేసి గాయపరిచి దూషించారని, వీరిని అరెస్ట్ చేయాలని లేనిపక్షంలో స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. దళిత నాయకులు చంద్రయ్య, కృష్ణప్ప, జయరాజు, నారాయణ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రండి సార్!

- కలెక్టర్, ఇతర అధికారులకు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక, ప్రసాదాలను అందజేసి నమస్కరిస్తున్న ఉప కమిషనర్

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో అక్టోబర్ 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా మహోత్సవాలకు రావాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయనతో పాటు ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హేమవంశీ, డీఆర్వో పుల్లయ్యను అర్చకులతో వెళ్లి కలిశారు. కుటుంబ సమేతంగా ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అంద జేసి వేదపండితులతో ఆశీర్వచనం పలికించారు.

ఉచిత పశు వైద్య శిబిరానికి స్పందన



పశువులకు చికిత్స చేస్తున్న సిబ్బంది

సదుం: మండలంలోని జోగివారిపల్లెలో పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 200 పశువులకు గర్భకోశ చికిత్స, నట్టల నివారణ మందు, పిడుదల మందు పిచికారీ చేశారు. పశుపోషణలో మెలకువలు వివరించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా ఉప సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, బాలసుబ్రహ్మణ్యం, ఏపీఎల్‌డీఏ సుబ్బారావు, సర్పంచ్ అనితాకుమారి, పశువైద్యులు సయ్యద్ తబ్రీజ్‌బాషా, చందనప్రియ, మునిచంద్ర, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.